సాక్షి ప్రకాశం

ఆదివారం | 22 | జనవరి | 2023



దళారుల మాటలు నమ్మొద్దు

కానిస్టేబుల్ పరీక్ష రాసే అభ్యర్థులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు.

- 8లో..



జగనన్న పాలనలో నిరంతర సంక్షేమం

సీఎం వైఎస్ జగన్ పాలనలో సంక్షేమం నిరంతరాయంగా అందుతుందని జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
29 /21

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

రేపటి నుంచి భాషా పండిట్ అభ్యర్థులకు థియరీ పరీక్షలు

ఒంగోలు: 2019–20, 2020–21 విద్యా సంవత్సరాలకు సంబంధించి లాంగ్వేజ్ పండిట్ ట్రెనింగ్ థియరీ పరీక్షలు ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మళ్లీ మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు ఒంగోలు శర్మా కాలేజీలో నిర్వహిస్తున్నట్లు డీఈవో బి.విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

23 నుంచి డీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఒంగోలు: 2021–23 బ్యాచ్‌కు సంబంధించి డీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 23 నుంచి స్థానిక సెయింట్ థెరెస్సా హైస్కూలులో నిర్వహిస్తున్నట్లు డీఈవో బి.విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

సైకిల్‌పై సాహస యాత్రికునికి సన్మానం



ధీరజ్ గుప్తాను సన్మానిస్తున్న సభ్యులు

మార్కాపురం: అంటరానితనాన్ని నిర్మూలించాలని, మత సామరస్యాన్ని కాపాడాలని, జాతీయవాదాన్ని పెంపొందించాలని, ప్రజలు కలిసి మెలిసి ఉండాలని కోరుతూ తాను దేశ వ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్నానని పంజాబ్‌కు చెందిన ధీరజ్ గుప్తా చెప్పారు. శనివారం సాయంత్రం ఆయన సైకిల్ యాత్ర మార్కాపురం వచ్చిన సందర్భంగా రీడింగ్ రూం ఆడిటోరియంలో సన్మానించారు. ఇప్పటి వరకు 14 నెలలో 22 రాష్ట్రాల్లో సైకిల్ యాత్ర పూర్తి చేశానని, మిగిలిన ఆరు రాష్ట్రాల్లో కూడా పర్యటిస్తానని తెలిపారు. పంజాబ్ నుంచి కన్యాకుమారి వరకు పర్యటన చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శాసనాల వీరబ్రహ్మం, పఠాన్ హుస్సేన్‌ఖాన్, ఆర్‌కెజీ నరసింహం, చక్కా మాలకొండ నరసిహారావు, మలిపెద్ది కేశవ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

- డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి



సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి

ఒంగోలు అర్బన్: జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) రాజ్యలక్ష్మి అధికారులకు సూచించారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో కంటి వెలుగు ఫేజ్–3పై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మైక్రో యాక్షన్ ప్లాన్ ప్రకారం సచివాలయాల పరిధిలో సంబంధిత పారామెడికల్ ఆప్తాలమిక్ అధికారులు 60 సంవత్సరాల వయసు పైబడిన వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. మే నెల చివరకు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. కంటి పరీక్షలు నిర్వహించే సమయంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నళిని, డీపీఎంవోలు, పారామెడికల్ ఆప్తాలమిక్ అధికారులు పాల్గొన్నారు.

ఒంగోలు నగరం వ్యూ



అమృత్ 2.0



ఒంగోలు నీటి సమస్యపై సీఎం జగన్‌కు వివరిస్తున్న బాలినేని (ఫైల్)

తాగునీటికి రూ.399.93 కోట్లు | ఒంగోలు వాసులకు రోజూ స్వచ్ఛధారలు | ఫలించిన బాలినేని కృషి

ఒంగోలు నగరవాసుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. నగరంలో రోజూ స్వచ్ఛధారలు పారనున్నాయి. రోజూ తాగునీరు రావాలన్న కోరిక తీరనుంది. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కృషితో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.399.93 కోట్లు మంజూరు చేసింది. గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా ఒంగోలు నగరపాలక సంస్థపై భారం మోపకుండా నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీఓ ఎంఎస్ 12ను విడుదలచేసింది. దీంతో పార్టీ శ్రేణులతోపాటు నగర వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- నగరపాలక సంస్థపై భారం లేకుండా నిధులు
- టీడీపీ హయాంలో రూ.123 కోట్లలో కార్పొరేషన్ భారం రూ.70 కోట్లు
- నేడు కార్పొరేషన్ చెల్లించాల్సింది రూ.7.29 కోట్లు మాత్రమే
- మరిన్ని అభివృద్ధి పనులకు రూ.15.48 కోట్లు

ఒంగోలు: ఒంగోలు నగర వాసులు దశాబ్దకాలంగా తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ప్రజలు తాగునీటి కోసం పడిగాపులు తప్పేవి కావు. పలు సందర్భాల్లో వారం రోజులకొకసారి వచ్చేవి. ఈ సమస్యను పరిష్కరించేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టిసారించారు. విస్తరిస్తున్న నగరం, పెరుగుతున్న జనాభా, భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య తీర్చేందుకు అధికారులతో చర్చించారు. ఇందుకు సంబంధించి మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి నగర వాసులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను తీసుకెళ్లారు. వేదికపై నుంచే నీటి సమస్య పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఇక బాలినేని ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. పలు దఫాలుగా దీనిపై ఉన్నతాధికారులను కలిశారు. కేంద్రప్రభుత్వ పథకం అమృత్ 2.0లో నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టారు. దీంతో దశాబ్దాల నీటి సమస్యకు పరిష్కారమార్గం లభించినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీఓ ఎంఎస్ 12ను జారీచేయడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లోనే కాకుండా నగర ప్రజానీకంలోను హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఏడు ప్రాజెక్టులకు రూ.355.41 కోట్లు :

నగరంలో పైపులైన్లు పూర్తిగా మార్చి కొత్త పైపులైన్లు వేసేందుకు, పైపులైన్లు లేని కాలనీల్లో నూతన పైపులైన్లు నిర్మించేందుకు మాత్రమే కాకుండా మరో ఆరు ప్రాజెక్టులకు అపెక్స్ కమిటీ ఆమోదం తెలియజేసింది. పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో చేపట్టే ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.110.87 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.196.32 కోట్లు భరిస్తుంది. అంటే 32.61 శాతం కేంద్రం భరిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం 57.75 శాతం నిధులు కేటాయించడం ద్వారా బాలినేని తన చిత్తశుద్ధి ఏంటో చూపించారు. నగరపాలక సంస్థ నిధుల నుంచి రూ.1.91 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ. 23.54 కోట్లు వెచ్చించాల్సి ఉంది. రూ.7.29 కోట్లు నిర్వహణ వ్యయాన్ని నగరపాలక సంస్థ కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

✔ ఇవి కాకుండా ఏపీ టిడ్కో ఏజెన్సీ పరిధిలో కొప్పోలు నుంచి చింతల, కొప్పోలులో తాగునీటి పంపిణీకి మరో రూ.9.78 కోట్లు కేటాయించారు. ఇందులో కేంద్రం రూ.3.26 కోట్లు, రాష్ట్రం రూ.5.41 కోట్లు, నగరపాలక సంస్థ రూ.1.11 కోట్లు భరించనున్నాయి.

✔ ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ (ఏపీజీబీసీ) కార్యక్రమంలో భాగంగా ఒంగోలు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు 2కు రూ.2.30 కోట్లు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకు 1కు రూ.1.40 కోట్లు, రంగారాయుడు చెరువుకు కోటి రూపాయలు, ముక్తినూతలపాడు చెరువుకు రూ.40 లక్షలు, కొప్పోలు చెరువుకు రూ.60 లక్షలు కేటాయించారు. నగరంలో పైపులైన్ల పునర్ నిర్మాణం కాకుండా మిగిలిన ఆరు ప్రాజెక్టులకు నగరపాలక సంస్థ నిర్వహణా వ్యయం కింద చెల్లించే మొత్తం రూ.15 లక్షలు మాత్రమే కావడంతో నగరపాలక సంస్థ పాలకవర్గం, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇదీ బాలినేని చిత్తశుద్ధి



జీఓ కాపీ చూపిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

దశాబ్దాల కాలంగా నగర వాసులు పడుతున్న తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు బాలినేని శ్రీనివాసరెడ్డి కంకణం కట్టుకున్నారు. ముఖ్యమంత్రి జగన్ నుంచి హామీ పొందటమే కాకుండా నిధులు మంజూరుకు పట్టువదలని విక్రమార్కుడిలా కృషి చేశారు. నగరపాలక సంస్థపై పెను భారం మోపకుండా నిధులు తెచ్చారు. గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో అమృత్ పథకం 1.0లో ఒంగోలు నగరాభివృద్ధి సంస్థకు రూ.123 కోట్లు కేటాయించారు. అందులో దాదాపు రూ.70 కోట్లు నగరపాలక సంస్థ చెల్లించాల్సి ఉంది. ఇంత పెనుభారాన్ని మోయలేక అవస్థలు పడాల్సి వచ్చింది. ఉన్నంత వరకూ నిధులు వాడేసి చేతులెత్తేశారు అప్పటి పాలకులు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బాలినేని నిధులు సాధించే వరకూ కృషి చేశారు. ప్రస్తుతం జారీ అయిన అమృత్ పథకం 2.0లో వాస్తవ సమస్యలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ భారాన్ని తాను భరించేందుకు ముందుకు వచ్చింది. రూ.339.93 కోట్లు కేటాయిస్తే అందులో కేవలం రూ.7.29 కోట్లు అది కూడా నిర్వహణా వ్యయం మాత్రమే నగరపాలక సంస్థ చెల్లించాల్సి ఉంది.

జిల్లాలో మున్సిపాలిటీలకు రూ.494.87 కోట్లు

జిల్లావ్యాప్తంగా మున్సిపాల్టీలకు రూ.494.87 కోట్లు విడుదలయ్యాయి. వీటిలో ఒంగోలు నగర పాలక సంస్థకు రూ.355.41 కోట్లు మంజూరుకాగా, దర్శి నగర పంచాయతీకి రూ.121 కోట్లు కేటాయించింది. పొదిలికి రూ.7.26 కోట్లు, మార్కాపురానికి రూ.4.42 కోట్లు, గిద్దలూరుకు రూ.3.42 కోట్లు, కనిగిరికి రూ. 2.66 కోట్లు, చీమకుర్తికి రూ.70 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో కేంద్ర ప్రభుత్వం రూ.182.11 కోట్లు , రాష్ట్ర ప్రభుత్వం రూ.260.55 కోట్లు, మున్సిపాలిటీలు రూ.4.86 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 32.61 కోట్లు విడుదల కానున్నాయి. ఇవి కాకుండా మున్సిపాలిటీలు నిర్వహణా వ్యయం కింద రూ. 14.64 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది.

రికార్డు స్థాయిలో నిధులు మంజూరు

> రికార్డు స్థాయిలో నిధులు మా పాలక వర్గంలో మంజూరు కావడం గర్వకారణంగా ఉంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో అమృత్ పథకానికి రూ.123 కోట్లకు నగరపాలక సంస్థ రూ.70 కోట్లు భరించాలన్నారు. ఇది సాధ్యమయ్యే పనేనా. కానీ ఆ పథకానికి సైతం బాలినేని వాసన్న ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు తెప్పిస్తున్నారు. ఇప్పుడు తాజాగా రూ.355.41 కోట్లు విడుదల కావడం ఒంగోలు మున్సిపాలిటీ లేదా నగరపాలక సంస్థ చరిత్రలోనే రికార్డు. ఇందుకు నగర ప్రజలు, పాలకవర్గం తరుపున బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.
>
> – గంగాడ సుజాత, మేయర్, ఒంగోలు నగరపాలక సంస్థ

సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు

- మంత్రి ఆదిమూలపు సురేష్
- పెద్దదోర్నాలలో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి సురేష్

పెద్దదోర్నాల: ముఖ్యమంత్రి జగన్‌తోనే అన్నిరకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. మండల కేంద్రంలోని 2వ సచివాలయం పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు అవ్వా తాతలకు 60 ఏళ్లు దాటినా పెన్షన్ మంజూరయ్యే పరిస్థితి లేదని, కానీ నేడు అవ్వా తాతలకు కావాల్సిన కనీస సౌకర్యాలను ఆ ప్రాంత వలంటీర్లే చూసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ఇతరత్రా సేవలను వలంటీర్ల ద్వారా ప్రజలకు వారి ఇంటి వద్దనే అందించటం హర్షణీయమని ఆయన కొనియాడారు. సంక్షేమ పాలన అందించేందుకు ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా నేడు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థలను తీసుకొచ్చి గ్రామీణ ప్రాంత ప్రజలకు విలువైన సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని కొనియాడారు. ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలను మసీదు వీధి, ఎస్సీ కాలనీల్లో కుటుంబ పెద్దలకు అందజేసి వారు ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి పొందారో వివరించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే పథకాలన్నీ సక్రమంగా అందుతాయని మంత్రి వారికి వివరించారు. కార్యక్రమంలో జార్జి విద్యా సంస్థల డైరెక్టర్ ఆదిమూలపు విశాల్, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, ఎంపీపీ గుమ్మా పద్మజ, జెడ్పీటీసీ సభ్యురాలు దుమావత్ లతాబాయి, సర్పంచ్ చిత్తూరి హారిక, డీఎల్‌డీఓ. సాయికుమార్, తహశీల్దార్ వేణుగోపాలరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, ఒంటేరు నాగేశ్వరరావు, మండల నాయకులు గుమ్మా యల్లేష్, చంద్రకాంత్ నాయక్, యక్కంటి మల్లారెడ్డి, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, పరుచూరి శీతారామయ్య, వల్లభనేని పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బాలినేనికి బ్రహ్మరథం

- నగర ప్రజల రుణం తీర్చుకునే మహద్భాగ్యం కలిగింది
- అబద్ధాలు చిరకాలం చెల్లవు..
- నాడు కార్పొరేషన్‌పై భారం వేస్తే..నేడు భారం మొత్తం రాష్ట్ర ప్రభుత్వంపైనే
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేస్తున్న బాలినేని



స్వాగతం పలికేందుకు వచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: నగర ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ వందల కోట్ల నిధులు విడుదల చేయించిన ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డికి నగర మేయర్ గంగాడ సుజాతతో పాటు, కార్పొరేటర్లు, నగర ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కావలి నుంచి ఒంగోలుకు శనివారం వస్తున్న ఆయనకు స్థానిక దక్షిణ బైపాస్ వద్ద ఘనస్వాగతం పలికారు. స్థానిక చర్చిసెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి బాలినేని గజమాల వేశారు. ఆర్య వైశ్యులు బాలినేనికి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి బాలినేనికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

చెప్పాం..చేస్తున్నాం..: బాలినేని

అనంతరం స్థానిక నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో బాలినేని శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఒంగోలు వచ్చిన సందర్భంలో నగర ప్రజల దాహార్తి సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని, ఆయన స్పందించి నేడు రూ.339 కోట్లు విడుదల చేయడం, జీవో కూడా జారీ చేయడం తనకు ఎనలేని సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. వారంరోజుల్లో టెక్నికల్ శాంక్షన్ కూడా పూర్తవుతుందని, అనంతరం పది రోజుల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. ఒంగోలులో 25 వేలమందికి ఇళ్ల పట్టాలు ఇచ్చే ప్రక్రియను మార్చిలో ప్రారంభించేందుకు సీఎంను ఆహ్వానించామని, వీలైతే అదే రోజు ఈ శంకుస్థాపన కార్యక్రమం కూడా ఏర్పాటు చేయిస్తానన్నారు. చెప్పాం.. చేస్తున్నాం.. ఇది మామాట అన్నారు.

అబద్ధపు ప్రచారాలతో చిల్లర రాజకీయాలొద్దు..

గతంలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎంతోమంది పనిచేశారని, కానీ ఎవరూ కూడా రూ.5 నుంచి రూ.10 లక్షల పనుల్లో కూడా పర్సంటేజీలు తీసుకున్నవారు లేరని, అది కేవలం ఆయనకు ఒక్కరికే దక్కిందని, అదీ ఆయన చరిత్ర అని పరోక్షంగా మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను ఉద్దేశించి అన్నారు. చంద్రబాబుతో బాలినేని సమావేశమయ్యారని, ఒంగోలు టీడీపీ టికెట్ బాలినేనికి అంటూ అబద్ధపు ప్రచారంతో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. చేతనైతే ధైర్యంగా పోటీకి నిలబడాలి తప్ప తప్పుడు ప్రచారం సరికాదని హితవు పలికారు. రోజుకో అబద్ధం సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాప్తిచేస్తుంటే జనం ఏదో ఒకనాడు నమ్ముతారని చంద్రబాబు చెబుతుంటారని టీడీపీ నుంచి తమ పార్టీలోకి వచ్చిన వారు అంటున్నారని బాలినేని పేర్కొన్నారు. తాను ఒంగోలు నుంచే వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్నానని, దమ్ముంటే పోటీకి సిద్ధం కావాలని సవాల్ విసిరారు.

వైఎస్సార్ సీపీకి 157 సీట్లు:

ఇటీవల సీఎంను కలిసినప్పుడు వైఎస్సార్‌సీపీకి తమ సర్వేలో 157 సీట్లు ఖాయమని చెప్పారని.. మస్తాన్ అనే వ్యక్తి 42 సీట్లలో సర్వే చేస్తే 40 సీట్లలో వైఎస్సార్‌సీపీ ఖాయమని తేలిందన్నారు. దీంతో నాలో భరోసా కల్పించేందుకు సీఎం చెప్పలేదని, వాస్తవాన్ని చెప్పారని అర్థం చేసుకున్నానని బాలినేని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేశాం అంటూ గొంతుచించుకునేవారు ఆలోచించాలన్నారు. మొదటి అమృత్ పథకంలో రూ.125 కోట్లు మంజూరైతే అందులో రూ.70 కోట్లు నూతనంగా ఏర్పడిన నగరపాలక సంస్థ చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఇది సాధ్యమేనా అని ప్రశ్నించారు. ఇటువంటి పరిస్థితుల్లో దానికి రుణం తీసుకుని నాలుగు నెలలుగా నెలకు రూ.79 లక్షలు వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఇదేనా అభివృద్ధి అంటూ మండిపడ్డారు. కానీ నేడు రెండో అమృత్ పథకంలో రూ.339 కోట్లు మంజూరైతే కేంద్రం ఇచ్చే కొంత భాగం మినహా మిగతా మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కేవలం రూ.7 కోట్లు అదికూడా పనులు పూర్తయిన తరువాత నిర్వహణకు సంబంధించి మాత్రమే నగర పాలక సంస్థ వెచ్చించాల్సి ఉంటుందన్నారు.

రాత్రిపూట నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం:

గడప గడపకు తిరుగుతుంటే మహిళలు రాత్రిపూట నీటి సమస్య బెడదకు పరిష్కారం కోరుతున్నారని, ఇకపై ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. ఈ నిధులతో రామతీర్థం జలాశయం నుంచి పైపులైను నిర్మాణం, నగరంలో 7 దశాబ్దాల నాటి పైపులైను బదులుగా నూతన పైపులైను వేయడం, 18 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, నగరపాలక సంస్థ కమిషనర్ యం.వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఇంజినీర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కనిగిరి యువకుడు మృతి

● హైదరాబాద్‌లో ఘటన


మహేంద్రారెడ్డి (ఫైల్)

కనిగిరి రూరల్‌: కనిగిరి మున్సిపాలిటీలోని చింతలపాలేనికి చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి పాపసాని మహేంద్రారెడ్డి (25) శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి–రాయదుర్గం ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వైఎస్సార్‌ సీపీ నాయకుడు పాపసాని చంద్రమౌళీశ్వరరెడ్డి కుమారుడైన మహేంద్రారెడ్డి 18 నెలల నుంచి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి తన స్నేహితుడు రాజవర్ధన్‌రెడ్డితో కలిసి టిఫిన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తూ బైక్‌ డివైడర్‌ను ఢీకొంది. ఈ దుర్ఘటనలో మహేంద్రారెడ్డికి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందగా, రాజవర్ధన్‌రెడ్డికి స్వల్ప గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వద్దన్నా వినకుండా వెళ్లి...

సంక్రాంతి పండుగకు కనిగిరి వచ్చిన మహేంద్రారెడ్డి.. వద్దన్నా వినకుండా గత మంగళవారం తిరిగి హైదరాబాద్‌ వెళ్లాడు. వద్దన్నా వినకుండా వెళ్లి మృత్యు ఒడికి చేరావా అయ్యా.. అంటూ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. చంద్రమౌళీశ్వరరెడ్డికి ఒక కుమారుడు, కుమార్తె కాగా, మహేంద్రారెడ్డి పెద్దవాడు. వ్యవసాయ కుటుంబం. చేతికందివచ్చిన కొడుకు హఠాన్మరణంతో తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతంగా మారింది. చింతలపాలెంలో విషాదం అలముకుంది. మృతదేహాన్ని ఆదివారం చింతలపాలెం తీసుకురానున్నట్లు బంధువులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ ప్రగాఢ సంతాపం తెలిపారు.

పాము కాటుతో రైతు మృతి


మృతి చెందిన లక్ష్మయ్య

కంభం: మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో పాము కాటుకు గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. అందిన వివరాల ప్రకారం నల్లబోతుల లక్ష్మయ్య (31) తన పొలంలో పనిచేస్తున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. దీంతో లక్ష్మయ్యను చికిత్స నిమిత్తం స్థానికులు కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ లక్ష్మయ్య మృతి చెందాడు. అతనికి భార్య, కుమారుడున్నారు.

ఆటో ఢీకొని వృద్ధ రైతు మృతి


మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్‌: టాటా ఏస్‌ ఆటో ఢీకొని వృద్ధ రైతు మృతిచెందిన సంఘటన కనిగిరి సమీపంలో శనివారం జరిగింది. కార్తీకపురంకు చెందిన కాకు చెంచయ్య (72) జొన్న పొలంలో పిట్టలు తోలుతూ రోడ్డు పక్కన గట్టుపై నిలబడి ఉన్నాడు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు నుంచి దర్శికి వేగంగా వెళ్తున్న ఆటో అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లి వృద్ధుడిని ఢీకొట్టి బోల్తా పడింది. చెంచయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలోని ప్రయాణికులకు స్వల్ప గాయాలవగా, సంఘటన స్థలాన్ని సీఐ, ఎస్సై పరిశీలించారు. చెంచయ్య మృతదేహాన్ని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌, పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వం నుంచి ఆదుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు.


చెంచయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

ఎంఈవోలకు అవగాహన అవసరం

ఒంగోలు: యూడైస్‌ ప్లస్‌పై జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులకు అవగాహన అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి బి.విజయభాస్కర్‌ అన్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన వివరాలను ఎలా నమోదు చేయాలనే అంశంపై స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో శనివారం ఎంఈవోలకు అవగాహన కల్పించారు.


బాలినేని శ్రీనివాసరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న జంకె, గంగాడ


భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

భగీరథునికి ఘన స్వాగతం

అభివృద్ధే వైఎస్సార్‌ సీపీ ధ్యేయమంటూ.. ఎల్లో మీడియా అభూత కల్పనలను పటాపంచలు చేస్తూ ఒంగోలు నగరవాసుల నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపారు. ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌ బాలినేని శ్రీనివాసరెడ్డి కృషితో రూ.339 కోట్ల నిధులు మంజూరు కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. శనివారం ఒంగోలు చేరుకున్న బాలినేనికి వేలాది మంది కార్యకర్తలు, నేతలు ఘనంగా స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. – సాక్షి, ఒంగోలు


బాలినేనికి స్వాగతం పలికేందుకు వేచి ఉన్న వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నాయకులు


ఒంగోలు కార్పొరేషన్‌ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న బాలినేని, పక్కన మేయర్‌, డిప్యూటీ మేయర్లు


బాలినేని చిత్రపటంతో పాల్గొన్న యువకులు

జగనన్న పాలనలో నిరంతర సంక్షేమం

- ● అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలు
- ● ఇలాగే కొనసాగాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలి
- ● జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్‌ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎలాంటి ఆటంకం లేకుండా నిరంతరం సంక్షేమ పథకాలు కొనసాగుతూనే ఉన్నాయని జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్‌ సుధాకర్‌బాబు, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే టీజేఆర్‌ ఆధ్వర్యంలో మండలంలోని పులికొండ సచివాలయం పరిధిలో గల మైలవరం గ్రామంలో శనివారం గడప గడపకు మన


ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్‌, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే సంక్షేమ పథకాలు ఇచ్చేవారని, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. గడపగడపకు కార్యక్రమంలో ఏ ఇంటికెళ్లినా సంక్షేమ పథకాలు పొందని వారు లేరంటే అతిశయోక్తి కాదన్నారు. ఇలాగే నిరంతరం పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే సాధ్యమన్నారు. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు, వైఎస్సార్‌ సీపీ నాయకులు రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన బుక్‌లెట్లను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఏయే ఇంట్లో ఎంతెంత ప్రయోజనం పొందారో స్వయంగా బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్‌ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి లబ్ధిదారులకు వివరించారు. తొలుత గ్రామంలోకి ప్రవేశించే సమయంలో స్థానిక సర్పంచ్‌ ఎం.రాజేంద్రకుమార్‌, ఎంపీటీసీ సభ్యులు, వైస్‌ ఎంపీపీ రావి లక్ష్మయ్య, వైఎస్సార్‌ సీపీ మండల మాజీ కన్వీనర్‌ దాసరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలతో వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ పమిడి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన...


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు స్వయంగా భోజనం తినిపిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్‌

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన సందర్భంగా మైలవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్‌ సుధాకర్‌బాబు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. చిన్నారులకు స్వయంగా భోజనం తినిపించి నాణ్యత గురించి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌, ఆయాతో మాట్లాడి రోజువారీగా అందిస్తున్న మెనూ వివరాలపై ఆరా తీశారు.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

- ● నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ● కాపీయింగ్‌కు పాల్పడితే ఇక ఉద్యోగాలు రావు
- ● ఒంగోలులో పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

ఒంగోలు టౌన్‌: పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా దళారులు చెబితే నమ్మి మోసపోవద్దని ఎస్పీ మలికా గర్గ్‌ చెప్పారు. పరీక్షల్లో సాయం చేస్తానని చెప్పినా నమ్మొద్దని సూచించారు. ఆదివారం రాష్ట్ర స్థాయిలో పోలీసు కానిస్టేబుల్‌ ఉద్యోగాలకు నిర్వహించనున్న ప్రాథమిక పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈమేరకు శనివారం ఒంగోలు నగరంలోని పరీక్షా కేంద్రాలను ఆమె పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లోని గదులు, పరిసర ప్రాంతాలు, పార్కింగ్‌, మంచినీటి వసతి, ఇతర ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ అక్కడ తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, నయమ నిబంధనలను పోలీసు అధికారులు, రీజినల్‌ కో ఆర్డినేటర్‌, సెంటర్స్‌ ఆఫ్‌ చీఫ్స్‌లకు పలు సూచనలు చేశారు. అనంతరం క్విస్‌ ఇంజినీరింగ్‌ కళాశాల వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిభ ఉంటేనే ఉద్యోగం వస్తుందని, ఈ విషయంలో ఎటువంటి మోసాలకు తావులేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు మాస్‌ కాపీయింగ్‌కు పాల్పడితే తదుపరి పోలీసు నియామకాల్లో వారిపై జీవితకాలం నిషేధం ఉంటుందన్నారు. అభ్యర్థులను పూర్తిగా తనిఖీ చేసిన తరువాతే పరీక్ష హాల్లోకి అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు తమహాల్‌ టికెట్లతో పాటుగా ఒరిజినల్‌ ఫొటో గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్‌ బాల్‌ పెన్నులు మాత్రమే తీసుకొని రావాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవకతవకలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకొన్నట్లు తెలిపారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రంలో, పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులు కాకుండా ఇతరులు ఎవరైనా కనిపిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సీఆర్‌పీసీ అమలులో ఉంటుందని, ప్రజలు గుంపులుగా గుమికూడవద్దన్నారు. అత్యవసర పరిస్థితిలో ఏదైనా సహాయం కోసం డయల్‌ 100, 112కు కాల్‌ చేయాలని కోరారు. ఏఎస్పీ (అడ్మిన్‌) కె.నాగేశ్వరరావు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు, తాలుకా సీఐ శ్రీనివాసరెడ్డి తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.


పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్‌

ఒంగోలులోని పరీక్ష కేంద్రాలు ఇవే...

ఎస్‌ఎస్‌ఎన్‌ డిగ్రీ కాలేజి, క్విస్‌ కాలేజి–3, కేంద్రాలు రైస్‌ కాలేజి–3 ,కేంద్రాలు పేస్‌ కాలేజి–2 ,చైతన్య జూనియర్‌ కాలేజి, గవర్నమెంట్‌ పాలిటెక్నిక్‌ కాలేజి ,ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, శ్రీ చైతన్య హైస్కూల్‌, ఎస్‌ఎస్‌ఎన్‌ ఇంజినీరింగ్‌ కాలేజి (సంతనూతలపాడు)

కిరాణా షాపునకు నిప్పు పెట్టిన ఆకతాయి

- ● పూర్తిగా కాలిపోయిన దుకాణం
- ● రూ.8 లక్షల వరకు నష్టం

పొన్నలూరు: కిరాణా షాపునకు ఓ ఆకతాయి నిప్పు పెట్టడంతో షాపు మొత్తం పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటన మండలంలోని విప్పగుంటలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం.. విప్పగుంట గ్రామానికి చెందిన గుడిపల్లి రవికుమార్‌ గ్రామంలోని జెడ్పీ పాఠశాలకు సమీపంలో కిరాణా షాపు పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ షాపులో కిరాణా వస్తువులతో పాటు విద్యార్థులకు కావాల్సిన నోట్‌ పుస్తకాలు, పెన్నులు, పాఠ్యపుస్తకాలు, కూల్‌ డ్రింక్స్‌ అందుబాటులో ఉంచి అమ్ముతుంటాడు. అలాగే సెల్‌ ఫోన్లు కూడదా రిపేర్‌ చేస్తుంటాడు. అయితే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హైస్కూల్‌ ప్రాంగణంలో మద్యం సేవిస్తూ మంచినీటి బాటిల్‌ కోసం కిరాణా షాపు దగ్గరకు వచ్చి రవికుమార్‌తో గొడవకు దిగి కొంతసేపు తరువాత అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో గొడవకు దిగిన వ్యక్తి రాత్రి సమయంలో రవికుమార్‌కు ఫోన్‌ చేసి నీ ఇల్లు, షాపును తగలబెడతానని బెదిరించి బూతులు తిట్టాడు. అందరూ నిద్రపోయిన తరువాత రాత్రి 2 గంటల సమయంలో కిరాణా షాపునకు నిప్పు పెట్టి పారిపోయాడు. ఇది గమనించిన గ్రామస్తులు నీళ్లు పోసి మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. అయితే అప్పటికే షాపుతో పాటు అందులో ఉన్న వస్తువులు, సెల్‌ ఫోన్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనతో రూ. 8 లక్షల వరకు నష్టం జరిగిందని రవికుమార్‌ తెలిపాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి. రాజారావు తెలిపారు.


విప్పగుంటలో పూర్తిగా కాలిపోయిన కిరాణా షాపు